క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


పూజలందుకున్న సూర్య భగవానుడు

పెందుర్తి: సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం


సూపరింటెండెంట్ విక్రమ్‌కు విరాళం అందిస్తున్న దాత లక్ష్మీనారాయణరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ రావు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందించారు.

శారదాపీఠంలో ఉగాది వేడుకలు


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా పీఠంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. స్వామీజీ చేతుల మీదుగా భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణంలో రాశి ఫలాల గురించి పండితులు వివరించారు. విశ్వావసు సంవత్సరం అంతా ప్రజలకు విశేష ఫలితాలు అందించాలని ఆకాంక్షించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీసీ కాలువకు శంకుస్థాపన


సీసీ కాలువ శంకుస్థాపనలో గ్రామ నాయకులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో చేపట్టనున్న సీసీ డ్రైన్‌కు సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం మంజూరు చేసిన రూ.7 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు. గ్రామంలో పైల దేముడు ఇంటి నుంచి చుక్క నూకరాజు ఇంటి వరకు సీసీ డ్రైన్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద పైల మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కె.కృష్ణవేణి, కె.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీ-4 అమలు కష్టసాధ్యం


రఘురామకృష్ణంరాజుకు అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: పీ-4 విధానం అమలు చాలా కష్టసాధ్యమని, సీఎం చంద్రబాబు పట్టుదల వల్ల రిజల్ట్ కనిపిస్తే మంచి కార్యక్రమం అవుతుందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు సింహాచలం వచ్చిన ఆయన స్వామిని దర్శించుకున్నాక, మీడియాతో మాట్లాడారు. పీ-4 విధానం ప్రజల్లోకి తీసుకెళ్లడం అసాధ్యంగా అనిపిస్తోందన్నారు. చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని, తప్పకుండా ముందుకు తీసుకెళ్లారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఆయనకు అందించారు.

దెబ్బతిన్న కల్వర్టులు.. పొంచి ఉన్న ప్రమాదాలు


మండలంలో పలు చోట్ల దెబ్బతిన్న కల్వర్టులతో గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన కల్వర్టులకు కనీస మరమ్మతులు చేపట్టేందుకూ ఆర్ అండ్ బీ అధికారులు చొరవ చూపట్లేదు. ఫలితంగా దెబ్బతిన్న కల్వర్టుల వద్ద రోజూ ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటోంది. శిథిల కల్వర్టులను పునరుద్ధరించడంతోపాటు, వాటికి రక్షణ గోడలు నిర్మించాలని వాటి మీదుగా రాకపోకలు సాగించే వివిధ పరిశ్రమల కార్మికులు, గ్రామీణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

– పరవాడ

శిథిల కల్వర్టులతో భయం భయంగా ప్రయాణం

మలుపుల వద్ద రక్షణ గోడల్లేక తరచూ ప్రమాదాలు

కల్వర్టులను పునర్నిర్మించాలని ప్రయాణికుల మొర



రోడ్డు విస్తరించి.. కల్వర్టు వదిలేసి

వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం వద్ద కొన్నేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు కూలిపోయాయి. 2018లో రోడ్డు విస్తరణ సమయంలో శిథిలావస్థకు చేరిన కల్వర్టును తొలగించి కొత్త వంతెనను నిర్మించాలని మత్స్యకార్మికులు మొరపెట్టుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు. పాత వంతెనను యథావిధిగా వదిలి, విస్తరణ పనులు పూర్తి చేశారు. దెబ్బతిన్న కల్వర్టుపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పచ్చి, ఎండు చేపల ఎగుమతులకు భారీ వాహనాలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తాయి. శిథిలావస్థకు చేరిన వంతెన ఏ సమయంలో కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.


ఊటగెడ్డ సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

రక్షణ గోడల్లేని కల్వర్టులు

పరవాడ–యలమంచిలి రహదారి ఊటగెడ్డ సమీపంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన రెండు కల్వర్టుల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేల సంఖ్యలో ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తారు. పరిశ్రమలకు యంత్ర సామగ్రి, ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల నుంచి బూడిద, బొగ్గును తరలించే భారీ వాహనాలకూ ఇదే ప్రధాన మార్గం. ఈ రహదారిలో కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రుళ్లు రక్షణ గోడలు లేని కల్వర్టులపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయాందోళన చెందే పరిస్థితి. గతంలో ఓ వాహన దారుడు చీకటిలో ప్రయాణిస్తూ రక్షణ గోడ లేని కల్వర్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు.

కల్వర్టుకు నిర్లక్ష్యపు 'గండి'

కలపాక–జాజులవానిపాలెం రహదారిలో మరిశవానిపాలెం చెరువు వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టు సమీపంలో హుదూద్ సమయంలో గండి పడింది. దీన్ని తూతూమంత్రంగా పూడ్చి వదిలేశారు. ఆ తరువాత పడిన భారీ వర్షాలకు మళ్లీ గండి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యంతో భారీ గుంతగా మారి, ప్రయాణికులను భయపెడుతోంది. హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమలకు రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులు, పరిసర గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. గండిని శాశ్వత ప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మరిశవానిపాలెం చెరువు వద్ద కల్వర్టు సమీపంలో గండి

మరమ్మతులు చేపట్టాలి



ఊటగెడ్డ సమీపంలో కల్వర్టులకు ఏర్పాటు చేసిన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవట్లేదు. రహదారిలో విద్యుత్ దీపాలు కూడా లేవు. రాత్రుళ్లు రాకపోకలు సాగించే సమయంలో కల్వర్టుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నాం. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలి.

– రాజాన సురేష్, పరవాడ

మలుపు.. ప్రమాదాల పిలుపు



పరవాడ–గాజువాక రహదారిలో దేశపాత్రునిపాలెం మలుపు వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీనికి ఓ పక్క నిర్మించిన రక్షణ గోడను గుర్తు తెలియని వాహనాలు ఢీ కొట్టడంతో కొన్నేళ్ల క్రితం పూర్తిగా కూలిపోయింది. రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మలుపులో కూలిపోయిన కల్వర్టు గోడను గుర్తించని ప్రయాణికులు వాహనాలతో కల్వర్టులో పడి తీవ్రగాయాలపాలైన ఘటనలు చాలా ఉన్నాయి. మలుపు తిప్పే క్రమంలో తుప్పల మధ్య ఉన్న కల్వర్టును గుర్తించక, అదుపుతప్పి వాహనాలు కల్వర్టులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

రక్షణ గోడలేవీ?



దేశపాత్రునిపాలెం వద్ద దెబ్బతిన్న కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టును నిర్మించాలి. ఇక్కడ మలుపులో కూలిన రక్షణ గోడను గుర్తించకుండా వాహనచోదకులు వేగంగా వచ్చి తరచూ కల్వర్టులో పడిపోతూ గాయాల పాలవుతున్నారు. అతి ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద వంతెనపై కొత్తగా రక్షణ గోడలు నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి.

– చిప్పాడ నరసింగరావు, దేశపాత్రునిపాలెం

కొత్త వంతెన నిర్మించాలి



వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టు వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిలో విద్యుత్ దీపాలు లేక రాత్రి వేళ వాహనచోదకులు వంతెన వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెన తొలగించి, కొత్త వంతెన నిర్మించేందుకు అధికారులు కృషి చేయాలి.

– తిత్తి మునలయ్య, ముత్యాలమ్మపాలెం

చలివేంద్రాలు ప్రారంభం


సుజాతనగర్‌లో లక్ష్మీనర్సయ్యమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో చలివేంద్రం


చింతగట్లలో చలివేంద్రం ప్రారంభిస్తున్న గనిశెట్టి కనకరాజు, మధుపాడ అంజి, ఎంపీటీసీ అప్పలరాజు

పెందుర్తి: సుజాతనగర్‌లోని లక్ష్మీనర్సయ్యమ్మతల్లి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. లక్ష్మీనర్సయ్యమ్మతల్లి ఆలయ ధర్మకర్త దాట్ల చంద్రరాజు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో తొలిరోజు సుమారు వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఆటోస్టాండ్ ప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

చింతగట్ల పంచాయతీ పరిధి ఇప్పిలివానిపాలెం ప్రధాన రహదారి వద్ద ఎంపీపీ మధుపాడ నాగమణి అంజి, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, ఉపసర్పంచ్ బొట్టా కనకమహాలక్ష్మి సంతోష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. నాయకులు మధుపాడ అంజి, గనిశెట్టి కనకరాజు, అప్పలరాజు, సంతోష్ చేతుల మీదుగా దాదాపు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పూడ్చిన నాలుగు మాసాలకే గుంతలు


గోతులతో నిండిన పరవాడ-వాడచీపురుపల్లి రహదారి


ఊటగెడ్డ మలుపులో ప్రయాణికులను భయపెడుతున్న గుంత

పరవాడ: గుంతలతో నిండిన వాడచీపురుపల్లి–పరవాడ రహదారితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో పడిన గుంతలను నాలుగు నెలల క్రితం పూడ్చారు. నెలలు తిరక్క ముందే రోడ్డులో యథావిధిగా ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం తదితర గ్రామాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. రోడ్డులో పలు చోట్ల పడిన గుంతలతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తున్న బూడిద, బొగ్గు లారీల కారణంగా రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఊటగెడ్డ కూడలి మలుపులో తరచూ ఏర్పడుతున్న గుంతను పూడ్చేందుకు శాశ్వత చర్యలు చేపట్టట్లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు గురైన మత్స్యకార సామాజిక భవనం


మత్స్యకార సామాజిక భవనం

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల మత్స్యకారుల సౌకర్యార్థం తీరంలో నిర్మించిన మత్స్యకార సామాజిక భవనం మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం నిర్వహణ సరిగా లేక మరమ్మతులకు గురైంది. భవనం ముందు నిర్మించిన ప్లాట్ ఫామ్ గచ్చులు పగుళ్లు ఏర్పడి, పెచ్చులుగా ఊడిపోయాయి. గోడలు, మెట్ల మార్గం శిథిల దశకు చేరాయి. ఏ మాత్రం వర్షం కురిసినా శ్లాబ్ నుంచి నీరు కారిపోతుంది. భవనంలో వేట సామగ్రిని భద్రపర్చుకోవడం ఇబ్బందిగా ఉందని గంగపుత్రులు వాపోతున్నారు. శిథిలావస్థకు చేరిన ప్లాట్‌ఫామ్ వల్ల చేపలు ఎండబెట్టేందుకూ వీల్లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం మరమ్మతుల కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం కనిపించలేదని మత్స్యకారులు ఆక్షేపిస్తున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి సామాజిక భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గంగపుత్రులు కోరుతున్నారు.

శ్మశాన వాటికలో బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న నాయకులు

పెందుర్తి: చింతగట్ల పంచాయతీ నందవరపువానిపాలెం శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతి పంపు(బోరు)ను ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంత్యక్రియల సమయంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఈ బోరును తవ్వించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గనిశెట్టి కనకరాజు, మధుపాడ అంజి, జి.అప్పారావు, బొట్టా సంతోష్, నాగరాజు, కనకరాజు, అప్పారావు, రమణ, ఆనంద్, కె.ఎస్.రావు, ఇప్పిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సురేష్‌కుమార్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(ఎంఏయూడీ) ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో అందించారు.

మహాకామేశ్వరి ఆలయంలో పంచాంగ శ్రవణం


మహాకామేశ్వరి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి సమీపంలోని మహాకామేశ్వరి ఆలయంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త డి.వై.చైనులు ఆధ్వర్యంలో సాయంత్రం ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పంచాంగకర్త తెన్నేటి విశ్వనాథశర్మ భక్తులకు రాశి ఫలాలు వివరించారు. వందలాదిగా పాల్గొన్న భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ చేపట్టారు.

6న సీతారాముల కల్యాణం

పెందుర్తి: సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని సంకట విమోచన అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా వచ్చే నెల 6న సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అప్పన్నకు విశేషంగా ఉగాది ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలతో కిక్కిరిసిన కల్యాణ మండపం


క్యూ కాంప్లెక్స్‌లో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ సేవల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలను అందించారు.

సింహగిరికి ఉగాది శోభ

సింహగిరి ఆదివారం ఉగాది శోభని సంతరించుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండపైకి భక్తులు పోటెత్తారు. యువత సాంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేశారు. ప్రసాద విక్రయశాల, అన్నప్రసాదశాల వద్ద భక్తులు బారులు తీరారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఉగాది సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన జరిపారు.

ఘనంగా ప్రారంభమైన లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు


అలంకరణలో లలితాంబిక


అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా మొదలయ్యాయి. వచ్చే నెల 6 వరకూ నిర్వహించే ఈ ఉత్సవాలను వేకువ జామున గోమాత పూజతో ప్రారంభించారు. శ్రీచక్రాలయంలోని శ్రీమేరు మొదటి అంతస్తులో అంగ, ప్రత్యంగ, ఉపాంగ దేవతల నవయోని యంత్రములో ఏర్పాటు చేసిన వాసని వాగ్దేవతలను అశీనులను చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. కొంతమంది భక్తులు లలితా సహస్రనామం, ఖడ్గమాల, త్రిశతి పారాయణలు చేశారు. తొలి రోజు కార్యక్రమాల్లో భాగంగా మహాగణపతి బాలా త్రిశతి సహిత లలితా హోమం నిర్వహించారు. షట్చక్రాలను శుద్ధిపరిచే కళావాహన పూజ జరిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా లలితాంబిక అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రష్యా, యూఎస్ఏ, కెనడా తదితర దేశ విదేశాల భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

పండితులకు ఉగాది సత్కారాలు


విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాల కృష్ణమాచార్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, ఈవో తదితరులు

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలువురు పండితులకు ఆదివారం ఉగాది సత్కారాలు చేశారు. దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు, పంచాంగ కర్త తెన్నేటి విశ్వనాథశర్మ, రిటైర్డ్ వేద పండితులు వడలి ఆంజనేయశర్మ, దేవస్థానం వంటశాల రిటైర్డ్ హెడ్ కుక్(కరోడా) ఎ.వి.రాఘవాచార్యులను గంటా శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా వేసి, స్వామివారి జ్ఞాపిక అందించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.